ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.6। కనిష్ఠం 20.9



కామారెడ్డి
జిల్లా వార్తలు

ఆదివారం 13 జూలై 2025

గర్భిణి, బాలింతలకు పోషకాహారం పంపిణీ

కామారెడ్డి టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మాతా శిశు సంరక్షణలో భాగంగా గర్భిణి, బాలింతలకు శనివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పోషకాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు వారు మాట్లాడుతూ తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండడానికి పోషకాహారం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రోటరీ క్లబ్ ఇంటర్‌నేషనల్ మహిళ అభివృద్ధిలో భాగంగా ఇలాంటి పలు కార్యక్రమాలు ఎన్నో చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ జైపాల్‌రెడ్డి, అధ్యక్షుడు శంకర్, సెక్రెటరీ కృష్ణహరి, ట్రెజరర్ రమణ తదితరులు పాల్గొన్నారు.



ఫేస్ టు ఫేస్...

సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం

చంద్రశేఖర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

ప్రశ్న: సీజనల్ వ్యాధుల నివారణపై ఎలాంటి దృష్టి సారించారు?

జవాబు: సీజనల్ వ్యాధుల నివారణకు వర్షకాలం మొదట్లోనే ప్రత్యేక కార్యాచరణను రూపొందించాం. ప్రతీ పీహెచ్‌సీల పరిధిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపాదికన హెల్త్ క్యాంపులు నిర్వహించి సేవలు అందించేలా చూస్తున్నాం. వర్షాకాలంలో వచ్చే వ్యాధులను వాటర్ బర్న్, వెక్టర్ బర్న్‌గా వేరు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

ప్ర: వాటర్ బర్న్, వెక్టర్‌బర్న్ అంటే ఏమిటి. అందులో ఏఏ వ్యాధులను గుర్తించారు?

జ: వాటర్ బర్న్ అంటే నీటి, ఆహార కలుషితం ద్వారా వచ్చే వ్యాధులు ఉంటాయి. అందులో టైఫాయిడ్, కలరా, జీర్ణాశయ వ్యాధులు, హెపటైటిస్ వ్యాధులు ఉంటాయి. వెక్టర్ బర్న్‌లో దోమల కాటు వల్ల వచ్చే వ్యాధులు డెంగీ, మలేరియా, మెదడు వాపు, చికెన్‌గున్యా వ్యాధులను గుర్తించాం.

ప్ర: దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: వర్షాకాలంలో ఎక్కువగా ప్రజలను బాధించే వ్యాధుల్లో దోమకాటు వ్యాధి ఉంటుంది. దోమ పుట్టకుండా చూడడం - దోమ కుట్టకుండా చూడడం అనే నినాదంతో పని చేస్తున్నాం. గ్రామాల్లో ఇంటి పరిసరాల పరిశుభ్రత, నీటి కుండలు, కొబ్బరి బోండాల్లో, కూలర్లలో నీరు నిల్వ ఉంచకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దోమల సంతతిని నివారించేందుకు చెరువులు, కుంటల్లో ఫాగింగ్, ఆయిల్‌బాల్స్ వేయడంతో పాటు చేతులు నిండుగా ఉండే బట్టలను ధరించాలని ప్రజలకు వివరిస్తున్నాం.

ప్ర: జిల్లాలో డెంగీ విజృంభణ ఏ స్థాయిలో ఉంది. ఎంత మంది డెంగీ భారిన పడ్డారు?

జ: జిల్లాలో ఇప్పటి వరకు 24 మంది డెంగీ భారిన పడ్డారు. వీరంతా కోలుకున్నారు. ఎక్కడ కూడా ప్రాణపాయ స్థితికి చేరకుండా చికిత్సలు అందేలా చూస్తున్నాం. ఎక్కడైన డెంగీ నిర్ధారణ అయితే ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని 50 మందికి ర్యాపిడ్ రెస్పాన్స్ టీం ద్వారా వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నాం. టీ హబ్‌లో ఐజీజీ, ఐజీఎం పరీక్షల్లో పాజిటివ్‌గా వస్తేనే డెంగీ చికిత్సలు అందించాలి.

ప్ర: జిల్లాలో దోమకాటు వ్యాధులతో పాటు ఇతర వ్యాధుల భారిన ప్రజలు పడుతున్నారా?

జ: జిల్లాలో డెంగీ తప్ప మలేరియా, చికెన్‌గున్యా, మెదడు వ్యాపు వ్యాధులు ఏమి నమోదు కాలేదు. బాన్సువాడ ఏరియాలో మాత్రమే టైఫాయిడ్‌కు సంబంధించిన వ్యాధి నిర్ధారణ అయింది. ఇప్పటివరకు 34 టైఫాయిడ్ కేసులు నమోదు కాగా వారికి చికిత్స అందించాం.

- కామారెడ్డి టౌన్, ఆంధ్రజ్యోతి



'బోన'భాగ్యాలు

కామారెడ్డి టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అనగానే గుర్తుకు వచ్చేవి బతుకమ్మ, బోనాల పండుగలు. ఈ పండుగలు ఈ ప్రాంత ప్రత్యేకతను చాటిచెప్పే సంస్కృతికి సజీవ సాక్ష్యాలు. ఆషాఢ మాసం మొదలుకొని శ్రావణమాసం చివరి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ బోనాల పండుగల సందడి కొనసాగుతోంది. తెలంగాణ సంస్కృతికి, ఆచారానికి సంప్రదాయానికి, విశ్వాసానికి ప్రతీక ఈ బోనాలు. తమను సల్లంగా చూడాలని ప్రజలు గ్రామ దేవతలైన పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, మహంకాళమ్మ, పెద్దమ్మలను వేడుకుంటూ బోనాలు సమర్పించే ఆచారం ఆనవాయితీగా వస్తోంది. డప్పుల చప్పుడుతో శివసత్తుల శీగములతో ఊగిపోతూ శిగమెత్తి ఆడుతుంటే.. పోతురాజు వీరగోల దెబ్బలతో.. గుగ్గిలం పొగ ఊరును కమ్మేయంగా భక్తిపారవశంతో ఊరు ఊరంతా ఊరేగింపుగా బోనాలు ఎత్తుకుని వెళ్లే తీరు మహా అద్భుతంగా సాగిపోతోంది. నేడు జిల్లాలోని కామారెడ్డిలోని పలు కుల సంఘాలతో పాటు, దోమకొండ, బీబీపేట మహంకాళీ అమ్మవారి బోనాల సందర్భంగా ప్రత్యేక కథనం.

బోనం అంటే భోజనం

తెలంగాణ రాష్ట్రంలో బోనాలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. అసలు బోనం అంటే భోజనం అనే అర్థమని చరిత్రకారులు చెబుతుంటారు. అన్ని జిల్లాల్లో చాలా చోట్ల పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ, ముత్యాలమ్మ, మహంకాలమ్మ, పెద్దమ్మ దేవతల ఆరాధన ఎక్కువగా కనిపిస్తోంది. వీరు ఏడుగురు గ్రామ దేవతలు అక్కా చెల్లెళ్లుగా పేరొందారు. వీరికి తోడు పోతురాజు తమ్ముడని చరిత్ర. అమ్మతల్లులకు పెట్టే నైవేద్యాన్ని భోజనంగా పరామన్నంగా భావిస్తారు. గ్రామ దేవతల ఆలయాల్లో గోపురాలు ఉండవు. తమకు నీడనిచ్చే చెట్లే అమ్మకు నీడనిస్తాయని భక్తుల విశ్వాసం. ఎవరి ఇండ్లలోనైన శుభకార్యం జరుగుతుంటే వాళ్లు బోనాలు తీస్తు పోచమ్మ, ముత్యాలమ్మలకు పండుగలు చేస్తుంటారు. ఈ వేడుక ఒక్క రోజుకే పరిమితం కాదు. ఆశాడ మాసంలో ప్రధానంగా ఆదివారాల్లో ఎక్కువగా బోనాలు తీస్తుంటారు. ఒక్కో గ్రామంలో ఒక్కో రోజు బోనాల పండుగను నిర్వహించుకోవడం జరుగుతాయి. నెల రోజుల పాటు జరుపుకునే ఉత్సవాలుగా బోనాలకు ఎంతో ప్రత్యేక గుర్తింపు ఉంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రత్యేకంగా ఓ రోజును బోనాలకు కేటాయిస్తూ ప్రకటించింది.

ఆషాఢ మాసంలోనే ఎందుకీ బోనాలు

ఆషాఢ మాసం నుంచే బోనాలు నిర్వహించడానికి కొన్ని ప్రత్యేక కారణాలు ఉన్నాయని పెద్దలు అంటుంటారు. ఈ కాలంలో వర్షాలు కురిసి వ్యాధులు విజృంభిస్తాయి. మరోవైపు గ్రామ ప్రజలు వ్యవసాయం మొదలు పెట్టేది ఈ సమయంలోనే కాబట్టి ప్రతి ఒక్కరూ తమ పిల్లా పాపలు, గొడ్డూ గోదా, పాడి పంటలు మొదలగువన్నీ చల్లంగా ఉండాలని మనసార కోరుకుంటూ గ్రామ దేవతలకు మొక్కులు చెల్లిస్తుంటారు. ఆశాఢ మాసం తొలి ఆదివారం నుంచే ఇళ్లలో సద్దికుండకు బొట్టు, పసుపుతో కూరించి దానితో అన్నం వండుతారు. కుండపై మూత పెట్టి దానిలో పానకం పోస్తారు. దాని మీద కంచుడు పెట్టి నూనె పోసి ఒత్తి వెలిగిస్తారు. దీనిని బోనం అంటారు. ఈ బోనం కుండలను ముత్తైదువలు తలపై పెట్టుకుని భద్రంగా పట్టుకుని ఊరేగింపులో పాల్గొంటారు. బోనం ఎత్తుకొనే మహిళలు కొత్త పట్టువస్త్రాలు ధరించి నిష్ఠ కలిగి ఊరేగింపుగా వెళ్తారు. వాళ్లకు ఎవరూ తాకకుండా వాళ్లు ఎంతో పవిత్రులు అనే భావన ప్రజల్లో కనపడుతోంది.

- మన సంస్కృతికి సజీవ సాక్ష్యాలు బోనాలు
- మొదలైన గ్రామ దేవతల పేరిట బోనాల ఉత్సవాలు
- ఊరు చివరల్లో చెట్టు మొదట్లో కొలువై ఉండే గ్రామ దేవతలు
- ఆషాఢం నుంచి శ్రావణ మాసం చివరి వరకు బోనాల సందడి
- ప్రతీ ఆదివారాల్లోనే బోనాల ఊరేగింపు

శివసత్తుల సందడి

బోనాలు ఎత్తుకున్న మహిళలు తమ తమ ఇళ్ల నుంచి డప్పు వాయిద్యాల మధ్య ఊరేంగిపుగా ముందుకు సాగుతారు. ఈ క్రమంలో శివసత్తుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. శివసత్తులు వేపకొమ్మలు పట్టుకుని శిగమూగుతూ సందడి చేస్తారు. ఊదు పొగ వేయడంతో ఒళ్లంతా పూనకం వచ్చి చిందులు వేస్తారు. కొన్ని చోట్లా పోతరాజులు ఒళ్లంతా పసుపు రాసుకొని వీరగోల కొరడాలతో విన్యాసం చేస్తారు. పోతురాజుల వెనుక బలిచ్చే జంతువును పట్టుకుని కుంకుమ బొట్టు, పసుపుతో వేప మండల

(మిగతా 8వ పేజీలో)

మహంకాళి తొట్టెల ఊరేగింపు

బీబీపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీబీపేట మండల కేంద్రంలో శనివారం సాయంత్రం మహంకాళి పండుగ సందర్భంగా తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని గ్రామస్థులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పాడి పంటలకు, పిల్ల పెద్దలకు, ఎలాంటి ఆరోగ్య రుగ్మతలు నష్టాలు వాటిల్లకుండా వర్షాలు సమృద్ధిగా కురవాలని అమ్మవారికి పూజిస్తామని తెలిపారు. సాంస్కృతికవాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలు, డీజే మోత లు మధ్య అంగరంగ వైభంగా తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివా రం మహంకాళీ కల్యాణ మహోత్స వం సందర్భంగా బోనాలతో ఊరేగి ంపు గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా ఉండి ప్రతీ సంవత్సరం ఈ కల్యాణాన్ని జరిపిస్తామని గ్రామస్థులు తెలిపారు.



తొట్టెలను ఊరేగిస్తున్న దృశ్యం

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం చిన్నారుల పాలిట శాపం

- అంగన్‌వాడీ భవన నిర్మాణం కలగా మిగిలేనా?
- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని అంగన్‌వాడీ భవనం
- సొంత భవనం లేక ప్రభుత్వ పాఠశాల గదిలోనే అంగన్‌వాడీ



7

చివరి మజిలీకి చింతలెన్నో..

7

- కంపు కొడుతున్న డంపింగ్ యార్డు
- దారి లేక ఇబ్బందులు పడుతున్న జనం
- పట్టించుకోని పాలకులు




అసంపూర్తిగా ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు

- అచ్చంపేటలో ఉప కేంద్రం కోసం అంగన్‌వాడీ భవనాన్ని కూల్చివేశారు
- ఉప కేంద్రం నిర్మాణం ఊసే లేదు
- ఇక్కట్లలో రోగులు



7



ఓటరు జాబితాకు సవరణ

కామారెడ్డి, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వడమే కాకుండా ఆర్డినెన్స్ జారీ చేసింది. రిజర్వేషన్ల చట్ట సవరణ కోసం ప్రభుత్వం చర్య లు చేపట్టింది. ఇందులో భాగంగా ఆయా జిల్లాల్లో ఓటరు జాబితా సవరణకు కసరత్తు చేపడుతున్నారు. అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితాకు అనుగుణంగా వీటిని రూపొందించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని ప్రచార నేపథ్యంలో గత ఫిబ్రవరి నెలలోనే గ్రామాల్లో వార్డుల వారీగా జాబితా తయారు చేసి ప్రదర్శించారు. కొత్త ఓటర్లను సైతం జత చేయగా దాదాపు మూడు నెలలు గడిచిపోవడంతో తాజాగా కొత్త జాబితా తయారీకి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం జిల్లా పరిషత్, మండల పరిషత్ అధికారులు జిల్లా పంచాయతీ అధికారులకు త్వరలోనే సంబంధిత సిబ్బందికి ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నారు.

- స్థానిక ఎన్నికలకు అనుగుణంగా రూపకల్పన
- క్షేత్రస్థాయిలో బీఎల్‌వోల ఇంటింటి పర్యటన
- గత ఓటరు జాబితా ప్రకారం పరిశీలన
- మరణించిన వారి పేర్ల తొలగింపు
- అర్హులైన కొత్త వారికి అవకాశం
- పంచాయతీ ఓట్లు 6,36,362.. పరిషత్ ఓట్లు 6,53,130

535 జీపీలు.. 4,686 వార్డులు

జిల్లాలోని 535 గ్రామ పంచాయతీల పరిధిలో 4,686 వార్డుల్లో కలిపి మొత్తం 6,36,362 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషుల ఓట్లు 3,06,560 ఉండగా మహిళలవి 3,29,787 ఓట్లు, 15 మంది ఇతరుల ఓట్లు ఉన్నాయి. మొత్తం పోలింగ్ కేంద్రాలు 4,705 ఉండగా గ్రామాల్లో 650 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. 200ల మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్, ఒక పోలింగ్ అధికారులను నియమించారు. 201 నుంచి 400 మంది ఓటర్లు ఉండే చోట ఒక ప్రిసైడింగ్, ఇద్దరు పోలింగ్ అధికారులు ఉండనున్నారు. 401-650 మంది ఓటర్లు ఉన్న దగ్గర ఒక ప్రిసైడింగ్, ముగ్గురు పోలింగ్ అధికారులు విధులు నిర్వహించేందుకు నిర్ణయించారు.

పరిషత్ ఓట్లు 6,53,130

జిల్లాలోని 25 జడ్పీటీసీ, 237 ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు తుది ఓటరు జాబితాను రెండు రోజుల క్రితం అధికార యంత్రాంగం ప్రకటించింది. జిల్లాలో మొత్తం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 6,53,130 ఉన్నాయి. ఇందులో మహిళలవి 3,38,941 ఓట్లు ఉండగా పురుషులవి 3,14,173 ఓట్లు ఉన్నాయి. ఇతరులవి 16 ఓట్లు ఉన్నాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓటర్లలో మహిళలే అధికంగా ఉన్నారు. పురుషుల కంటే మహిళ ఓట్లు 24,768 ఓట్లు ఉన్నాయి. వీటితో పాటు పోలి ంగ్ కేంద్రాలను సైతం గుర్తించారు. మొత్తం పోలింగ్ కేంద్రాలు 1,286 ఉన్నాయి. ఇలా ఓటరు జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు సైతం నాలుగు నెలల కిందటే పూర్తి చేశారు. మరోసారి జాబితా సవరణను చేయనున్నారు.

మార్పులు.. చేర్పులకు అవకాశం

పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఓటరు జాబితాను వార్డుల వారీగా విభజించాల్సి ఉంటుంది. ఏ ఇంటి నెంబర్ ఏ వార్డు పరిధిలోకి వస్తుందో పరిశీలించాలి. జాబితాలో పాత ఓటర్లతో పాటు కొత్తగా అదే ఇంటి నెంబర్‌తో ఉండే ఓటర్లను వెతికి ఒకే ఇంటి నెంబర్‌తో ఉన్న వారందరిని ఒక చోట చేర్చి వరుస సంఖ్య కేటాయించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారీ గా ఓటర్లను గుర్తించి జాబితాను రూపొందిస్తారు. ఎవరైన ఇల్లు మారినా ఏ వార్డులోకి వస్తారు, చనిపోయిన వారి పేర్లు తొలగిస్తూ కొత్తగా ఓటరు నమోదు చేసుకున్న విషయాలను పరిశీలించి తాజాగా జాబితాను తయారు చేయనున్నారు.

విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చూడాలి

- జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి సతీష్‌యాదవ్

కామారెడ్డి టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి సతీష్ యాదవ్ తెలిపారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. వసతి గృహంలోని రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న భోజన సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు ప్లేట్స్ గ్లాస్‌లు అందించి వసతి గృహ ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగవద్దనే ఉద్దేశ్యంతో వసతి గృహాల్లో నాణ్యమైన భోజనంతో పాటు సౌకర్యాలను కల్పిస్తుందని తెలిపారు. ప్రతీ విద్యార్థి తమ చదువులో ముందుండి మంచి ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నామన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైన నాటి దాని సంరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. మనం నాటే ప్రతీ మొక్క భవిష్యత్తు తరానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహవార్డెన్ స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి సతీష్‌యాదవ్

తెలంగాణ జన జీవనానికి పాట ప్రాణం లాంటిది



మాట్లాడుతున్న మద్ది చంద్రకాంత్‌రెడ్డి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జన జీవనానికి పాట ప్రాణం లాంటిదని కామారెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో యువతి, యువకులను ప్రోత్సహించడానికి 'పాటకు సలాం' పాటల రచన వర్క్‌షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటల ప్రాధాన్యతను గుర్తించి యువకులు రచయితలుగా, గాయకులుగా సమాజంలో రాణిస్తారని తెలిపారు. యువతి, యువకులను పాటలకు దగ్గర చేయడానికి సమాజాన్ని చైతన్యపరిచి మంచి మార్గంలో నడిపించడానికి పాటలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, గాయకుడు అష్ట గంగాధర్, గజల్ కవి సూరారం శంకర్, మోహన్ రాజ్, శ్యామ్‌కుమార్, మౌర్య జీవన్, నాగ భూషణం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సభ్యులు పరీక్షలు రాయాలి



కార్యాలయాన్ని సందర్శించిన ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారి

నవీపేట,జూలై12(ఆంధ్రజ్యోతి): చదువు మధ్యలో మానేసిన మహిళా సంఘాల సభ్యులు ఓపెన్‌టెన్త్, ఇంటర్, డిగ్రీ పరీక్షలు రాయాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ స్టేట్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల ఐకేపీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళాసంఘాల సభ్యులకు చదువుతో పాటు డిజిటల్ లిటరసీ, ఆర్థిక అక్షరాస్యతలపై శిక్షణ అందించాలని కోరారు. నిరక్షరాస్యులైన మహిళ సంఘాల సభ్యులకు వాలంటీర్ల ద్వారా చదవడం, రాయడం నేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో అశోక్, ఏపీఎం భూమేష్ గౌడ్ తదితరులున్నారు.

ప్రాణాంతక వ్యాధులపై అవగాహన

మోస్రా,జూలై12(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మోస్రా పరిధిలోని చింతకుంట, తిమ్మాపూర్ గ్రామాల్లో వైద్య అధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఇంటి ఇంటికి తిరుగుతూ ప్రాణంతక డెంగ్యూ, వర్షాకాల వ్యాధుల పట్ల సీజనల్‌గా వచ్చు జ్వరం, దగ్గు వంటి వ్యాధుట పట్ల అవగాహన కార్యక్రమం చేశామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కొందరికి వివిధ వ్యాధుల పరీక్షలు చేసి అందురు వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని దోమల వల్ల పలు రకాల విష జ్వరాలు వస్తాయి కనుక మన ఇంటి చుట్టు ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించుకోవాలని గ్రామస్థులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాయమ్మ, చింతకుంట పల్లె దవాఖాన ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పోచంపాడ్ గురుకుల బాలుర పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మెండోర , జూలై 12 (ఆంధ్రజ్యోతి): పోచంపాడ్ బాలల గురుకుల పాఠశాల 1999-2000 సంవత్సర పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు 25 సంవత్రాల సిల్వర్ జూబ్లీ వేడుకలతో పాటు మధుర స్మృతులను గుర్తు చేసుకొని ఆడుతూ పాడుతూ సందడి చేశారు. ఉమ్మడి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ ఉపాధ్యాయ బృందం కూడా పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాలలో 5 హెచ్పీ మోటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాటి పాఠశాల ప్రిన్సిపల్ రాజయ్య, నందకిషోర్, రవీందర్, వసంత రెడ్డి, అబ్దుల్ వహీద్, డేనియల్ శాస్త్రి, ఫిజికల్ డైరెక్టర్ రాజన్న, ప్రిన్సిపల్ సురేందర్, పూర్వ విద్యార్థులు రమేష్, జితేందర్‌రెడ్డి, రమేష్, నవీన్, రాజేశ్వర్, రామకృష్ణ, గంగాధర్‌లు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గాంధారి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదెల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పోకాల హన్మాండ్లు(45) అనే కౌలు రైతు బోరుబావి వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. గాంధారి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లద్దప్‌మౌలానా పొలంను పోకాల హన్మాండ్లు కౌలుకు చేస్తున్నాడు. శనివారం పొలంలోని స్టార్టర్ డబ్బాలో లోపం వచ్చిన నేపథ్యంలో విద్యుత్ సరాఫరా సరిచేయడానికి ప్రయత్నించాడు. విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య శకుంతల, ఇద్దరు కుమార్తెలు అంజలి,అఖిలలు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ నర్సయ్య తెలిపారు.

అటవీశాఖ అధికారులకు జింక పిల్ల అప్పగింత



జింక పిల్లలను అటవీశాఖ అధికారులకు అప్పగిస్తున్న దృశ్యం

కోటగిరి,జూలై12(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామ శివారులో శనివారం ఓ జింక పిల్ల లభ్యమైంది. కుక్కల భయంతో జింక పిల్ల ఓ చెట్టు కింద ఉండడాన్ని గమనించిన స్థానికులు జింక పిల్లను గ్రామానికి తీసుకుని వచ్చారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం జింకపిల్లను కోటగిరి పశువైద్య కేంద్రానికి తీసుకురాగా వైద్య అధికారి సురేష్‌కుమార్ జింకపిల్లకు వైద్యం చేశారు. అటవీశాఖ అధికారి సురేష్‌కు జింకపిల్లను అప్పగించారు. వన్యప్రాణులను సంరక్షించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని అటవీశాఖ అధికారులు కోరారు.

బోధన్‌లో ద్విచక్రవాహనాల చోరీ

బోధన్‌రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్నారని పట్టణ వాసులు, కాలనీవాసులు పేర్కొంటున్నారు. సరస్వతినగర్‌లో శుక్రవారం అర్ధరాత్రి కాలనీలో గుర్తుతెలియని వ్యక్తి ఇంటి ముందు పార్క్‌చేసిన ద్విచక్ర వాహనాన్ని దొంగలిస్తూ సీసీ కెమెరాలో కనిపించాడని కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అలాగే ప్రతి ఆదివారం వారాంతపు సంతలో సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళుతున్నారని, చోరీలను అరికట్టాలని కోరారు. రాత్రి సమయాల్లో పోలీసులు నిఘా పెంచాలని, పెట్రోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

కొడిచర్లలో 30 ట్రాక్టర్ల ఇసుక డంప్ సీజ్

కోటగిరి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో శనివారం తెల్లవారుజామున 30 ట్రాక్టర్ల ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. కొడిచర్ల మంజీర నది నుంచి ఇసుకను రాత్రి వేళ అక్రమంగా తరలిస్తూ గ్రామ పొలి మేరల్లో డంప్ చేస్తున్నారన్న సమాచారం మేరకు ఇసుక డంప్‌లను గుర్తించి సీజ్ చేశామన్నారు. ఈ విషయమై తహసీల్దార్ గంగాధర్‌కు సమాచారం అందించామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు.

కాంగ్రెస్‌తో బీసీలకు సమన్యాయం

● కాంగ్రెస్ నాయకుల సంబరాలు



స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బోధన్‌రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞత తెలుపుతూ సాలూర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. టపాకాయలు కాలుస్తూ స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మందర్నా రవి మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కార్యక్రమంలో బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, సాలూర సొసైటీ అధ్యక్షులు అల్లె జనార్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లె రమేష్, కేజీ గంగారాం, డిస్కో సాయిలు, ఖాజాపూర్ అశోక్, హన్మంత్, సొక్కం ప్రశాంత్, శివకాంత్, తగ్గెల్లి దేవురావు, జాడి దేవదానం, దేశిపేట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి అన్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలో శనివారం కాం గ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్యాబినెట్ మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతూ గ్రామంలో ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమం లో బీసీసెల్ మండల అధ్యక్షుడు గణేష్ గౌడ్, మారంపల్లి లిఫ్ట్ చైర్మన్ బోజారెడ్డి, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సుమన్, దేగాం గం గారెడ్డి, బాపురావు, దశగౌడ్, సుద్ద చిన్నయ్య, గోపిగౌడ్, శ్యాం, ముఖేష్, రాజు, మున్నఉన్నారు.

ఆర్మూర్ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై చర్యలు చేపట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తు శనివారం ఆలూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి చిత్ర పటాలకు కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి డేగ పోశెట్టి, మల్లారెడ్డి, నవనీత్, సంజీవ్, గంగారెడ్డి, శ్రీనివాస్, ఉదయ్, సాయి, శశి, వినోద్, భరత్, మహేష్, చిన్నయ పాల్గొన్నారు.

వికలాంగులు, వృద్ధులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు

బోధన్‌రూరల్,జూలై12(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వికలాంగులకు, వృద్ధులకు, వితంతవుల సంక్షేమ అభివృద్ధి కోసం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 18న జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామని ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వస్తున్నారని పేర్కొన్నారు. కావున వికలాంగులు పింఛన్ లబ్దిదారులందరు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వికలాంగుల సమస్యలు పరిష్కరించని యెడల వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఆగస్టు 13వ తేదీన తాడోపేడో తేల్చుకుంటామన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వికలాంగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లస్సింగారి భూమయ్య మాదిగ, సోంపూర్, పోచీరాం, బోధన్ నాయకులు తాడెం అబ్బయ్య, గంధమాల చంద్రయ్య, రవి, శివకుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మాసం ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

బోధన్‌రూరల్,జూలై12(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని మారుతీ మందిరంలో దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో వచ్చే నెల శ్రావణ మాసం పురస్కరించుకుని ఆగస్టు 5వ తేదీన 101జంటలతో సామూహిక లక్ష తమలపాకుల మహపూజ మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ మహరాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండెటి శంకర్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునుంచి భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లికి సేవను కొండపై చుట్టు ప్రదక్షణ చేయించారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ సంజీవ్‌గౌడ్, బ్రాహ్మన్ పల్లి సింగిల్ విండో చైర్మన్ కాటిపల్లి నర్సారెడ్డి పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్ : పట్టణంలోని ప్రసిద్ద జంబి హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజ లు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రేగుల సత్యనారాయణ, డైరెక్టర్ దొండి రమణ మాట్లాడారు. కార్యక్రమంలో చిక్కాల నవీన్, నారాయణ రెడ్డి, అభినవ్ పాల్గొన్నారు

చెరువులో పడి సివిల్ ఇంజనీర్ మృతి



ఉమా గణేష్(ఫైల్ ఫొటో)

నవీపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ శివారులోని కాశీరెడ్డి చెరువులో ప్రమాదవశాత్తు పడి గుట్టి ఉమా గణేష్ (30)అనే ప్రైవేట్ సివిల్ ఇంజనీర్ మృతిచెందాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. బోధన్ నుంచి భైంసా వరకు కొనసాగుతున్న 161బీబీ జాతీయరహదారి విస్తరణ పనులను పర్యవేక్షిస్తున్న ప్రైవేట్ సివిల్ ఇంజనీర్ ఉమా గణేష్ కొంతకాలంగా ఇక్కడే పనిచేస్తున్నాడని, శుక్రవారం సాయంత్రం కోస్లీ శివారులో పని నిమిత్తం బయటకు వెళ్లిన అతడు తిరిగి చేరుకోలేదని అన్నారు. శనివారం ఉదయం ఉమాగణేష్ మృతదేహం చెరువులో బయటపడిందని, మృతుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడు ఉమా గణేష్ అవివాహితుడు అని అతడు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా చీరాల మండలం వేటపాలెం గ్రామానికి చెందినవాడని ఎస్ఐ వివరించారు. మృతుడి కుటుంబీకులు ఆంధ్ర నుంచి బయల్దేరి మార్గమధ్యలో ఉండడంతో శనివారం రాత్రి వరకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వివరించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కిసాన్‌నగర్ తండాలో డెంగీ



గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్యులు

● డెంగీ బాధితులకు వైద్యపరీక్షలు

మాచారెడ్డి, జూలై 11(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలోని భవానీపేట గ్రామపరిధిలోని కిసాన్‌నగర్ కాలనీలో 11 మందికి డెంగీ వ్యాధి నిర్ధారణ అయినట్లు మాచారెడ్డి ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఆదర్శ్‌కుమార్ తెలిపారు. డెంగ్యూ బారినపడిన బాధితుల్లో ఏడుగురు కోలుకున్నారని, ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో కామారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. మరో ఇద్దరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, నెలరోజుల్లో కిసాన్‌నగర్‌లోని కాలనీవాసులు జ్వరాలతో వణికిపోతున్నారని డెంగీ కేసులతో భయాందోళనకు గురవుతున్నారు. నీరు నిల్వ ఉండటం కారణంగానే కాలనీవాసులు జ్వరాల బారినపడి డెంగ్యూకు గురవుతున్నారని, ప్రతిరోజు ప్రజలకు అవగాహన కల్పించి నెలరోజులుగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్ అజాగ్రత్తగా నడిపిన వ్యక్తిపై కేసు

బోధన్‌రూరల్, జూలై12 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని మందర్నా గ్రామంలో గత నెల 24వ తేదిన సోన్‌కాంబ్లే సాయిలు అనే పొలం యాజమాని తన పొలంలో మద్నూర్ సాయినాథ్ అనే వ్యక్తితో ట్రాక్టర్ రోటివెటర్‌తో పని చేస్తున్న క్రమంలో డ్రైవర్ ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడపడంతో పొలం యాజమాని సాయిలుకు కుడి కాలు రోటవెటర్‌లో ఇరుక్కుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. గాయాలపాలైన సాయిలు యొక్క మేనల్లుడు శనివారం బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తామన్నారు. యాజమాని కాలు విరగడానికి కారణమైన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు చేపడతామన్నారు.

ఒన్నాజిపేట్‌లో చోరీ

ధర్పల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒన్నాజిపేట్ గ్రామంలో జరిగిన చోరీకి సంబంధించి 24గంటల్లో దొంగను పట్టుకోవడంపై ధర్పల్లి ఎస్ఐ కళ్యాణి, సిబ్బందిని సీఐ భిక్షపతి అభినందించారు. చోరీకి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామంలో గల దేవాలయంలో హుండీని పగులగొట్టి అందులో గల డబ్బులు అపహరించుకుపోయాడు. అదే రోజు అదే గ్రామానికి చెందిన వసీంకు దుకాణంలో తాళం పగులగొట్టి చోరీకి ప్రయత్నించారని ఆయన ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల దర్యాప్తులో భాగంగా ఎస్ఐ కళ్యాణి స్పెషల్ టీంకు సమాచారం అందించగా దొంగను ధర్పల్లి బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. చోరీకి పాల్పడింది మంచిప్ప గ్రామానికి చెందిన పోతురాల నాగరాజు అని తేలింది. అతని వద్ద నుంచి రూ.2106 ను సీజ్ చేశారు. కాగా నాగరాజు పై గతంలో సైతం వివిధ పోలీస్ స్టేషన్‌లలో కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

తెలుగుభాష పై ప్రత్యేక శిక్షణ తరగతులు

ఆర్మూర్ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలలో శనివారం తెలుగును అనర్గళంగా చదవడం, రాయడంపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించారు. మూడోతరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు నాలుగు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సంగరాజు భాస్కరాజు హాజరై విద్యార్థులకు తెలుగు భాషలో శిక్షణను ఇచ్చారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు తెలుగు అక్షరాల పరిచయం నుంచి ప్రారంభించి పదాల నిర్మాణం, వాఖ్య నిర్మాణం, పఠన నైపుణ్యం, మెరుగైన చేతిరాత, తదితర అంశాలలో శిక్షణను ఇచ్చి విద్యార్థులచే రాయించి పలకడంలో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పోలపల్లి సుందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ముత్యాల

కమ్మర్‌పల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల ఆప్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలను బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కుమార్ శనివారం పరామర్శించారు. మండలంలోని బషీరాబాద్ గ్రామంలో చిలివేరి చిన్న గంగారం, డిష్ శ్రీకాంత్, కోనాసముందర్‌లో గణేష్‌నుపరామర్శించిన ఆయన మాజీ ఎంపీపీ గుడిసె అంజమ్మ భర్త నారాయణఅనారోగ్యంతో బాధపడుతుండగా ఆయను పరామర్శించారు. . ఆయన వెంట కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్య, కిసెన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగెల ప్రవీన్, కాంగ్రెస్ నాయకులు శ్రీరాముల మురళి, కస్తూరి శ్రీనివాస్, గుడిసె అంజమ్మ, జైడ శ్రీనివాస్, తదితర నాయకులు ఉన్నారు.

మెండోర : మండలంలో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన కొప్పెల దేవరాజ్ నానమ్మ చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులను, కరీం గత కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనను, సోన్‌పేట్ గ్రామానికి చెందిన ఇందిరమ్మ కమిటి సభ్యురాలు సాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. సునీల్‌కుమార్ వెంట టౌన్ అధ్యక్షుడు గుండోజి, రవి, సుభాష్, మాల్కేష్, అశోక్, మౌలానా, రాజేశ్వర్, సాయిరెడ్డి, గంగారెడ్డి తదితరు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెర్కిట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్మూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం హౌజింగ్ బోర్డులో గల పార్క్‌లో సైబర్ ఫ్రాండ్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. సైబర్ ఫ్రాడ్‌కు గురికాకుండా ఉండేందుకు పార్కుకు వాకిగ్ వచ్చిన వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హ్యాపీ వాకర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

తాడ్వాయి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శనివారం 8 మంది పేకాట రాయుళ్ళను అరెస్టు చేసినట్లు తాడ్వాయి ఎస్సై మురళి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న పక్క సమాచారం మేరకు స్థావరంపై దాడి చేసి గ్రామానికి చెందిన ముసుకు గంగారెడ్డి చెట్టే సాయిలు, బండి లింగం, ఆకిటి రాజిరెడ్డి, మహమ్మద్ జావిద్, మరాటి గంగాధర్, ఉప్పు నరసింహులు, సర్దన గంగారాంలను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరి వద్ద నుండి సుమారు 6450 రూపాయలను, ఎనిమిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నిజాంసాగర్ నూతన నవోదయ విద్యాలయ ప్రవేశాలు ప్రారంభం

● 40 మంది జాబితా వెల్లడి

నిజాంసాగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నూతన నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశాలు ప్రారంభించినట్లు ఇన్ చార్జి ప్రిన్సిపాల్ యోహాన్నన్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. నిజామాబాద్ నవోదయ విద్యాలయం నిజాంసాగర్ విద్యాలయంలోని తాత్కాలిక ప్రాంగణంలో ఆరో తరగతిలో విద్యాభ్యాసం చేసేందుకు 2025-26 విద్యా సంవత్సరంలో 40 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించడం అవుతుందని ఆయన తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారం భం కానునందున వితః కింద నియమింపబడ్డ హాల్‌టికెట్ సంఖ్యలు గలవారు తాత్కాలిక ప్రతిపాదికన ఎంపికయ్యారని తెలిపారు. సోమవారం నుంచి విద్యార్థిని విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాలని ఆయ న తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికన ఎంపికైన విద్యార్థిని విద్యార్థులకు మొబైల్ ద్వారా సమాచారం అందించామని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులు హాల్‌టికెట్ల సంఖ్యను వెల్లడించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



ఉపాధ్యాయులకు ఇంగ్లీష్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

పెర్కిట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్‌పరిధిలోని మామిడిపల్లిలో గల నలందర పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇంగ్లీష్ ల్యాబ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో ఇంగ్లీష్‌లో మాట్లాడడానికి, చదువడానికి ఉన్నత చదువులకు ఉపయోగించడానికి ఏ విధంగా మాట్లాడాలో శిక్షణను ఇచ్చారు. శిక్షకుడు కిషోర్ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు శిక్షణను ఇచ్చినందుకు గాను యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవళిక, సరిత, సౌమ్య, సమీర్, అనంత్‌రావు పాల్గొన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

పెర్కిట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణ ప్రజల సౌకర్యార్థం ఆర్మూర్ ఆర్టీసి డిపో నుంచి మంగళవారం రాత్రి 9 గంటలకు సూపర్ లగ్జరి బస్సు బయల్దేరునని డిపో మేనేజర్ రవికుమార్ తెలిపారు. తిరుగు ప్రయాణంలో సమ్మక్క సారలమ్మ, రామప్ప గుడి, వేయిస్తంభాల గుడి, భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని గురువారం ఆర్మూర్ చేరుకుంటుందని ఈ ప్రయాణానికి 19 వందల రూపాయల చార్జీ ఉంటుందని తెలిపారు. అదేవిధంగా 21వ తేదీనాడు సాయంత్రం 5 గంటలకు ఆర్మూర్ డిపో నుంచి పండరిపురానికి ప్రత్యేకబస్సు ఏర్పాటు చేస్తున్నామని 22న తుల్జాపూర్ భవాని మాత, సోలాపూర్ సిద్ది వినాయక్ దర్శనం చేసుకొని 23న ఆర్మూర్ చేరుకుంటుంది. ఈ ప్రయాణానికి చార్జీలు పెద్దలకు 2400 రూపాయలు ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందస్తుగా టికెట్ బుకింగ్ కొరకు ఆర్మూర్ బస్టాండ్ నందు ఆన్‌లైన్ రిజర్వేషన్ కౌంటర్ సదుపాయం కలదని తెలిపారు.

అటవీ శాఖకు సంబంధించిన భూసర్వే

మోస్రా,జూలై12(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సబ్ కలెక్టర్ వికాస్ మహతో బోధన్ ఆదేశాలనుసారం మోస్రా గ్రామ శివారులోని సర్వే నెంబర్ 952, 953లకు సంబంధించిన రైతులు పలు ఫిర్యాదులు చేయగా సమస్యలు పరిష్కారం దిశగా శనివారం ఈ సర్వే నెంబర్‌లో గల భూమినిని అటవీశాఖ, తహసీల్దార్ ఆధ్వర్యంలో పట్టా భూములు, ప్రభుత్వం భూములు, అటవీశాఖ భూములపై సర్వే చేపట్టినమని అటవీశాఖ భూమిలో ఎవరైనా కబ్జాలో ఉన్నారా అని గుర్తించేందుకు సర్వే చేశామని తహసీల్దార్ రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సెక్షన్ అధికారి కోటేష్ జాదవ్, బీట్ హుస్సేన్, తహసీల్దార్ కార్యాలయం, సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికులకు బకాయిలు చెల్లించాలి

ఆర్మూర్ ఆర్మూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నా భోజన కార్మికులకు రావాల్సిన బకాయిలు, గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆర్మూర్‌లోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మధ్యాహ్నభోజన ఏజెన్సీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే మధ్యాహ్నా భోజన ఏజెన్సీ కార్మికులకు రూ.10వేల గౌరవ వేతనం ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేరలేదన్నారు. ఇలా ఉండగా ఆరు నెలల నుంచి కోడిగుడ్ల బిల్లు, మూడునెలల నుంచి గౌరవ వేతనం, మెనూ చార్జీలు రావడం లేదని ఆయన అన్నారు. ప్రతీస్కూల్‌లో గ్యాస్ సిలెండర్‌ను ప్రభుత్వమే సమకూర్చాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్నా భోజన ఏజెన్సీ కార్యదర్శి జక్కం సుజాత, భవిత, విజయమ్మ, దేవాయి, రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు. .

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయంలో నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తు నోటిఫికేషన్ విడుదల చేశామని సహాయ కమిషనర్ వి.విజయరామరావు తెలిపారు. ధర్మకర్తలు ఈనెల 27వ తేదీ లోపు సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రహరీకి గేట్‌లను ఏర్పాటు చేయాలి

ఆర్మూర్ రూరల్ , జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ బస్టాండ్, డిపోను ఆనుకొని ఉత్తర భాగంలో నిర్మిస్తున్న ప్రహరికి రెండు వైపులా వాక్-వే గేట్లు ఏర్పాటు చేయాలని విద్యానగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యామాద్రి భాస్కర్ ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ రవికుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డున ఆనుకొని హౌజింగ్‌బోర్డు, మహాలక్ష్మీ కాలనీ, గణేష్‌నగర్ కాలనీలతో పాటు పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు ఉన్నాయని, పూర్తిస్థాయిలో ప్రహరి నిర్మిస్తే బస్టాండ్‌లోని వెళ్లడానికి విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పట్టణ ప్రజలు, విద్యార్థుల సౌకర్యార్థం ప్రహరికిరువైపులా వాక్-వే గేట్‌లు నిర్మించాలని ఆయన కోరారు.

రేపు బషీరాబాద్ ఐటీఐలో జాబ్‌మేళా

కమ్మర్‌పల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14 న కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉదయం 10 గంటలకు బషీరాబాద్ ఐటీఐ కళాలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఈ జాబ్‌మేళకు వరుణ్ మోటార్స్ హైదరాబాద్ కంపెని ప్రతినిధులు నిజామాబాద్ సుక్‌జీత్ స్టోర్స్ మిల్ కంపెనీవారు, ప్రీమియం ఎనేర్జీఎస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెని హైదరాబాద్, ఎవరెస్టుస్కెలుస్ కంపెని సారంగపూర్ వారు ఇంటర్వ్యూలద్వార అర్హులైన వారిని ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఐటీఐ ట్రేడ్స్ లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇట్టి అవకశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం కోటిరెడ్డి కోరారు.గూగుల్ ఫామ్‌లింక్‌ద్వార మీ పెర్లునమోదు చేసుకోవాలన్నారు. అదనపు సమాచారం నిమిత్తం 9491566890, 810794500 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సీఎంఆర్ చెక్కుల పంపిణీ

ముప్కాల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ చెక్కులను శనివారం కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాలకు అందజేశారు. దూదేకుల బాషుకు రూ. 56 వేలు, మహ్మద్ సాబేరా కు రూ. 38 వేలు, రాజేష్‌కు రూ. 28 వేలు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమర్ కు కృతజ్ఞతలు తెలిపారు.



గుత్ప పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి(ఫైల్)



గుత్ప లిఫ్ట్ మొదటి పంపుహౌస్

గుత్పకు పదిహేడు వసంతాలు

● పూర్తి ఆయకట్టుకు అందని సాగు నీరు ● సీసీ లైనింగ్‌కు నోచుకోని గ్రావిటీ కెనాల్ ● గత రబీ సీజన్‌ను తలపించనుందని రైతుల ఆందోళన ● ప్రత్యామ్నాయం చూపాలని వేడుకోలు

నందిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జల యజ్ఞం పేరుతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకానికి పదిహేడు వసంతాలు నిండాయి. గోదావరి జలాల ద్వారా నిజాంసాగర్ చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో రూ.204కోట్ల వ్యయంతో చేట్టిన పథకాన్ని స్వర్గీయ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 18.03.2008న జాతీకి అంకితం చేశారు. రెండు పంటలకు సాగు నీరు అందించినప్పటికి ప్రాజెక్టు నేడు దీన స్థితిలో ఉంది. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటికి గ్రావిటీ కెనాల్ పూర్తి స్థాయి సీసీ లైనింగ్‌కు నోచుకోలేదు. నందిపేట ఆయకట్టుకు సాగు నీరు అందించాలని నిర్మించిన రెండు ప్రత్యేక పైపులైన్లలో ఒకటి పూర్తి స్థాయిలో సాగు నీరు అందించడం లేదు. దీంతో పూర్తి స్థాయి లో చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం కలగానే ఉండిపోయింది. గత సంవత్సరం సంవృద్దిగా వర్షాలు పడినప్పటికి సీసీ లైనింగ్ లేక, పిచ్చి మొక్కలతో నిండిన గ్రావిటీ కెనాల్ ద్వారానే నీటి సరఫరా జరిగింది. దీని ద్వారా పూర్తి స్థాయి ఎకరాలకు అధికారులు సాగు నీరు అందించలేకపోయారు. ప్రక్కనే గ్రావిటీ కెనాల్ ఉన్నా నీరందక వరి పైరు ఎండు ముఖం పట్టింది. రబీ సీజన్‌లో మాత్రం అధికారులు భగీరథ ప్రయత్నమే చేశారు. ఈ సంవత్సరం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు గోదావరి నదిలో నీటి మట్టం ఒక స్థాయిలో ఉంది. దీనికి తోడుగా మహరాష్ట్ర నుంచి బాబ్లీ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల చేశారు. దీంతో గోదవరిలో వరద ఉధృతి పెరిగింది. గుత్ప ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల చేస్తే గత రబీ సీజన్ మాదిరే సాగు నీరు అందనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అసంపూర్తిగా గ్రావిటీ కెనాల్ సీసీ లైనింగ్

రైతు నాయకుల ఒత్తిడి మేరకు 2011లో సిమెంట్ లైనింగ్ పనులకు రు.6కోట్లు మంజూరు చేసింది ప్రభుత్వం. ధరలు పెరగడంతో రెండు పర్యాయాలు టెండర్లు పిలిచినా కంపెనీలు ముందుకు రాలేవు. మళ్ళీ ప్రభుత్వం రు.7కోట్లు మంజూరు చేసింది. తాడూరి బాలేశ్వర్ రెడ్డి అండ్ కన్‌స్ట్రక్షన్ (టిబిఆర్) కంపెనీ పనులు దక్కించుకుంది. వర్షాలతో వాతావరణం అనుకూలించక, ఖరీఫ్, రబీకి నీరు అందించడంతో సిమెంట్ లైనింగ్ పనులు ఆలస్యంగా మొదలైనాయి. రు.3 కోట్ల విలువచేసే పనులు చేస్తే అధికారులు మాత్రం రు.1.30కోట్లు మాత్రమే చెల్లించారు. మిగతా డబ్బుల విషయమై అధికారులను సంప్రదిస్తే బడ్జెట్ అయిపోయిందని చేతులేత్తేశారు. దింతో సదరు కంపెనీ పనులను మధ్యలోనే నిలిపేసింది. తర్వాత డెలివరీ సిస్టర్న్ వద్ద అలాగే 133/11కెవి సబ్ స్టేషన్ దగ్గర కొద్దిపాటి సిమెంట్ లైనింగ్ చేశారు. ఇంతపెద్ద పథకాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవడంపై రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రూ.204 కోట్లతో ఎత్తిపోతల..

నందిపేట మండలంలోని ఉమ్మెడ పాత గ్రామం శివారులోని గోదావరి ఒడ్డున ఎనిదేళ్ల కిందట ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా రూ.204 కోట్లతో అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. ఆరు మండలాల్లోని (నందిపేట, మాక్లూర్, ఆర్మూర్, జక్రాన్ పల్లి, వేల్పూర్, బాల్కొండ) 38వేల 792 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రెండు పంపౌస్‌లు ఎర్పాటు చేశారు. ఒకటి ఉమ్మెడలో మరొకటి మాక్లూర్ మండలం లక్ష్మాపూర్‌లో బజార్‌కొత్తూర్ శివారులో నుంచి మాక్లూర్ మండలం ధర్మోర చెరువు వరకు 9 కిలో మీటర్ల పొడవుతో గ్రావిటీ కెనాల్‌ను నిర్మించారు. మొదటి పంపు హౌస్ ద్వారా నాలుగు మోటార్లతో కెనాల్ ద్వారా ధర్మోర చెరువులోకి నీరు వెళితేనే నిజాంసాగర్ చివరి ఆయకట్టు వరకు సాగు నీరు సంమృద్దిగా అందుతుంది. కాని నాలుగు మోటార్లతో నీటిని వదిలితే, గ్రావిటీ కెనాల్ కోతకు గురవుతోంది. దీంతో అధికారులు రెండు, మూడు మోటార్లతోనే సరిపెట్టుతున్నారు. సారునీరు అందని మిగతా మండలాల రైతులు ఆందోళనలకు దిగారు. ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చారు.

ఇదీ చరిత్ర

కీ.శే.అక్సాపూర్ అశోక్‌రెడ్డి అనే రైతు గుత్ప లిఫ్ట్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ 1993, అక్టోబర్ 2న ఉద్యమం చేపట్టారు. ప్రభుత్వంకు వినతి పత్రం సమర్పించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం 1999, జూన్ 25న లిఫ్ట్ మంజూరు చేస్తూ జీవో 120ని జారీ చేసింది. అదే తడవుగా మరుసటి రోజున అప్పటి ఉమ్మడి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రతి పక్షాలు పలు మార్లు శిలాఫలకానికి తద్దినాలు నిర్వహించారు. గుత్ప సాధన సమితి 2003, మే 21న ఆమరణ నిరాహర దీక్ష చేపట్టింది. స్పందించిన ప్రభుత్వం మే 24న సాంకేతిక విద్యా మంత్రిగా ఉన్న నేరేళ్ళ ఆంజనేయులు జో క్యంతో నిరాహర దీక్షను విరమింప జేసింది. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రాథమిక విద్యా శాఖ మంత్రిగా ఉన్న మండవ 2004లో గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో 2005, ఏప్రిల్ 3న రాష్ట్ర ముఖ్యమత్రి వైఎస్ గుత్ప లిఫ్ట్ పనులను ప్రారంభించారు. అక్కడే రాష్ట్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, పైపులైన్ డిజైనింగ్, సిమెంట్ కోటింగ్‌లపై చర్చించి పూర్తి స్థాయి ఆదేశాలు జారీ చేశారు. పనులు దక్కించుకున్న పలు కంపెనీలు అడపాదడపా పనులు పూర్తి చేయగా 18.03.2008న నీటి విడుదల చేసి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ గుత్ప లిఫ్ట్‌ను జాతీకి అంకితం చేశారు. అప్పటి నుంచి రెండు పంటలకు సాగు నీరు అందించిన అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకం నేడు ఆశించిన స్థాయిలో సాగు నీరు అందించడం లేదు.

పథకం వివరాలు

ఆయకట్టు - 38,792 ఎకరాలు
అంచనా వ్యయం-రూ.204కోట్లు
లబ్ధి మండలాలు - నందిపేట, మాక్లూర్, ఆర్మూర్, బాల్కోండ, వేల్పూ ర్, జక్రాన్‌పల్లి
నీటి పరిమాణం- 540 క్యూసెక్కులు
నీటి ఎత్తు- 69.32 మీటర్లు
పైపులైన్- 11.29కి.మీ
గ్రావిటీ కెనాల్- 9.085కి.మీ
పంపుహౌస్‌లు- రెండు
మోటార్లు - మొదటి పంపు హౌస్ వద్ద 2250 కిలోవాట్లు సామర్థ్యం గలవి నాలుగు. రెండవ పంపుహౌస్ వద్ద 1725 కిలోవాట్లు సామర్థ్యం గలవి నా లుగు. (వర్టికల్ టర్బన్ రకం)
విద్యుత్ సామర్థ్యం- 18 మెగావాట్లు. (0.41మిలియన్ యూనిట్లు)
డిస్ట్రిబ్యూషన్- నిజాంసాగర్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటర్ 74 నుంచి డి.82 వరకు



మధ్యలోనే ఆగిపోయిన అంగన్‌వాడీ భవనం

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
చిన్నారుల పాలిట శాపం

- అంగన్‌వాడీ భవన నిర్మాణం కలగా మిగిలేనా...?!
- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని అంగన్‌వాడీ భవనం
- సొంత భవనం లేక ప్రభుత్వ పాఠశాల గదిలోనే అంగన్‌వాడీ సెంటర్
- పైసలు లేక మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్

తాడ్వాయి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వమే చిన్న పిల్లల పాటి శాపంగా మారింది మండలంలోని కరడ్‌పల్లి గ్రామంలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా మధ్యలోనే వదిలేశారు. ఎందరో అధికారులు, నాయకులు ప్రభుత్వ పాఠశాలను సందర్శిస్తున్నారు. కాని పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనాన్ని ఇటు అధికారులు, అటు నాయకులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు అంటున్నారు. 20 ఏళ్ల క్రితం 10 లక్షలతో నిర్మించిన భవనం ఇప్పుడు శిథిలావస్థలో ఉంది. రాజుల పైసా రాళ్ల పాలు అన్నట్లు అధికారుల, కాంట్రాక్టర్ల తీరు ఉంది. పక్కనే ఇంకొక అంగన్‌వాడీ భవనంలో సెంటర్ నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు భవనం గులుతుందోనని భయంతో విద్యార్థులు చిన్న పిల్లలు భయపడుతున్నారు. ప్రభుత్వ పాటశాలలోని విద్యార్థులు మైదానంలో క్రీడలు ఆడేటప్పుడు అటుగా వెళ్తే చీడ పురుగులు పాములు సంచరిస్తున్నాయని అంటున్నారు. అంగన్‌వాడీ భవనం లేక గ్రామంలోని ఒక అంగన్‌వాడీ సెంటర్‌ను ప్రభుత్వ పాఠశాలలోని ఒక గదిని కేటాయించి నిర్వహిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు. అప్పటి సర్పంచ్ కేసీ మురళీమోహన్ సుమారు 10.15 లక్షల రూపాయలతో ఉన్నంత వరకు భవనాన్ని ని ర్మించాడు. ఉన్న పైసలు సరిపోక మధ్యలోనే భవన నిర్మాణం ఆగిపోయిందన్నాడు. ఇప్పుడు సుమారు ఇంకా 10 లక్షలతో ఈ నిర్మాణం పూర్తవుతుందని గ్రామస్థులు అంటున్నారు. సొంత అంగన్‌వాడీ భవనం లేక విద్యార్థులు అంగన్‌వాడీ టీ చర్లకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఉపాధ్యాయులు అంటున్నారు.



ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్

● ప్రభుత్వం బిల్లు మంజూరు చేస్తే నిర్మాణం చేపడతాం



అంగన్‌వాడీ బిల్లులు రాక మధ్యలోనే ఆగిపోయింది. ఇంకా మూడు లక్షల వరకు బిల్లు రావాలి. ప్రభుత్వం బిల్లు మంజూరు చేస్తే నిర్మాణం చేపడతాం.

\- కేసీ మురళీమోహన్, కరాడ్‌పల్లి

● నిధులు మంజూరు చేయాలి



సొంత భవనం లేక అంగన్‌వాడీ సెంటర్ నడపడానికి ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి భవనాన్ని నిర్మించేలా చూడాలని అంటున్నారు.

-ఏలేటి కృష్ణారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్, కరాడ్‌పల్లి

చివరి మజిలీకి చింతలెన్నో

● కంపు కొడుతున్న డంపింగ్ యార్డు ● దారి లేక ఇబ్బందులు పడుతున్న జనం ● పట్టించుకోని పాలకులు



దుర్కి గ్రామంలోని వైకుంఠదామంలో పేరుకుపోయిన చెత్త

నసురుల్లాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మనిషి చనిపోయిన తర్వాత ప్రశాంతంగా ఉండే ప్రదేశం వైకుంఠధామం, అటువంటి చివరి మజిలీకి ఎన్నో చింతల మధ్యన వెళ్లాల్సి వస్తుంది. దారి పొడవునా కంప ముళ్ళు, పిచ్చి మొక్కలతో మట్టి రోడ్డు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గల వైకుంఠ దామాల్లో సమస్యలకు నిలయంగా మారాయి. త్రాగునీరు లేక నేటికీ ఇబ్బంది అయ్యి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని దుర్కి గ్రామంలో డంపింగ్ యార్డు, కంపోస్టు షెడ్డు, వైకుంఠ ధామం ఒకే చోట ఉండడంతో వైకుంఠధామం పూర్తిగా డంపింగ్ యార్డును తలపిస్తుంది. దీనితో చనిపోయిన వారిని ఖననం చేయడానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్మశాన వాటికలో కనీసం పది నిమిషాల పాటు నిలబడదామన్నా కూడా నిలబడలేని విధంగా వాతావరణము ఉండడంతో ప్రజలకు దుర్వాసన కొడుతుంది అంటూ వాపోతున్నారు. గ్రామ పంచాయతీకి ఆర్థిక ఆదాయం చూపించాలన్న ఉద్దేశంతో కంపోస్టు షెడ్డును ఏర్పాటు చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి.



వైకుంఠ దామానికి వెళ్లే దారి పరిస్థితి

శ్మశాన వాటికకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది: సాయి, గ్రామస్థుడు

గ్రామంలో గల వైకుంఠదామంలో సమస్యలు తాండవిస్తున్నాయి. నీటి సౌకర్యం లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సంబంధిత అధికారులు స్పందించి నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి.

నేడు చాముండేశ్వరీ బోనాలు

● ఇతర ప్రాంతాల నుంచి దోమకొండకు పెద్దఎత్తున చేరుకున్న భక్తులు



చాముండేశ్వరీ ఆలయం

దోమకొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దోమకొండ మండలకేంద్రంలోని చాముండేశ్వరీ దవి ఆలయంలో బోనా పండుగ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. బోనాల సందర్భంగా ఉదయం 6గంటల నుంచి అమ్మవారికి అభిషేక అలంకరణ, 7 గంటలకు ఘటం ఊరేగింపు, 10:30కు రంగం ఎక్కుట, మధ్యాహ్నం 12:30 గంటలకు బోనాల ఊరేగింపు, సాయంత్రం 6:45గంటలకు అమ్మవారి పూజ, 7:45 గంటలకు మహాహారతి, రాత్రి 8గటంలకు తీర్థప్రసాదాల వితరణ, సోమవారం వారంతపు సంత, జాతర, సాయంత్రం అమ్మవారి చీర వేలంపాట నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి సిద్దారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎం‌సురేష్ షెట్కార్ హాజరవుతారని తెలిపారు.

బడి భయం పోగొట్టండిలా..!

● చిన్నారుల్లో స్కూల్ ఫోబియా
● కొద్దిపాటి జాగ్రత్తలతో భయం దూరం



రెంజల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చక్కటి యూనిఫామ్ వేసుకొని.. చిట్టి చిట్టి చేతులతో బ్యాగులు పట్టుకొని బుడిబుడి అడుగులు వేస్తూ బడికి వెళ్తుంటే చిన్నారులను తల్లిదండ్రులు చూసి మురిసిపోతుంటారు. తెలియని ఆనందంలో మురిసిపోతుంటాం. ఈ ఆనందం వెన్నంటే ఉంటుంది. ఉదయాన్నే పిల్లల్ని నిద్ర లేపి పాఠశాలకు తయారు చేయడమంటే తల్లిదండ్రులకు తల ప్రాణం తోకకు వచ్చినట్లవుతుంది. బడికి వెళ్లనంటూ పేచీ పెట్టే పిల్లల్ని ఎలా తయారు చేయాలో తెలియక చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు అవస్థలు పడుతుంటారు. కొత్తగా బడికి వెళ్లే పిల్లల్లో కొందరిలో బెరుకు వారిలో ఉన్న భయాన్ని పొగొట్టడం ఒక పద్ధతి ఇప్పటి వరకు చదివిన బడి నుంచి కొత్త బడికి మార్చినప్పుడు తలెత్తే సమస్యకు వేడుక్కోవడం మరి పద్ధతి.

● ఉపాధ్యాయులుగా ఇలా చేయాలి..

తరగతి గదిలోకి కొత్తగా విద్యార్థి రాగానే అతనిని తోటి విద్యార్థులకు పరిచయం చేయాలి. కొత్త విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎక్కువగా ప్రశ్నలు అడుగవద్దు. దీంతో వారు బెదిరే అవకాశం ఉంది. బడికి వచ్చిన మొదటి రోజుల్లోనే హోంవర్క్ ఇవ్వకపోవడం మంచి అంటున్నారు.

● స్కూల్ ఫోబియా..

బడికి వెళ్లమని పిల్లలు మారం చేయడాన్ని వైజ్ఞానిక పరిభాషలో స్కూల్ ఫోబియా అంటారు. స్కూల్ దగ్గరకు రాగానే పెద్దగా ఏడవడం, వాంతులు చేసుకోవడం, కడుపు నొప్పి, తల నొప్పి, కళ్లు తిరగడం, మొదలైన అనారోగ్య లక్షణాలు పిల్లల్లో కనిపిస్తాయి.

అసంపూర్తిగా ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు

● అచ్చంపేటలో ఉప కేంద్రం నిర్మాణం ఊసే లేదు ● పాలకులు, అధికారులు స్పందించాలని నిరసనలు



బంజపల్లిలో స్లాబు వేసి వదిలేసిన ఉప కేంద్రం ఇదే..

నిజాంసాగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందుబాటులో ఉండేందుకు లక్ష్యంగా ప్రభుత్వం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. కాని గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ప్రస్తుత ప్రభుత్వం నిధులు కే టాయించకపోవడంతో అవి అసంపూర్తిగా మిగిలాయి. అధికారులు, పాలకులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజాంసాగర్ మండలంలోని బంజపల్లి, నర్సింగరావుపల్లి, అచ్చంపేట గ్రామాలలో రూ.20 వ్యయంతో ఒక్కొక్క ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణాలు చేపట్టారు. బంజపల్లి, నర్సింగ్ రావు పల్లి గ్రామాల్లో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పిల్లర్ల నిర్మాణం చేపట్టి స్లాబు వేశారు. ఈ భవన నిర్మాణాలకు నిధులు లేకపోవడంతో నిర్మాణం పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారు. ఈ భవన నిర్మాణాలకు ఒక్కొక్క భవనానికి 26 లక్షల రూపాయలు అవసరం కాగా ఇంజనీర్ అధికారులు 20 లక్షల రూపాయలతోనే భవన నిర్మాణం పూర్తవుతుందని ఎస్టిమేంట్ రూపొందించారు. ఈ భవన నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ స్టీలుతో పాటు ముడి సరుకు ధరలు పెరగడంతో 20 లక్షల రూపాయల వ్యయంతో కుక్క భవనం పూర్తి కాదని అధికారులకు విన్నవించిన ఫలితం లేక పోయింది. నరసింగరావుపల్లి, బంజపల్లి గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణం అసంపూర్తిగాని మిగిలిపోయాయి. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ప్రస్తుత ప్రభుత్వం వీటి నిర్మాణాలకు నిధులు సమకూర్చకపోవడం గమనార్హం. అచ్చంపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర నిర్మాణం చేసేందుకు గ్రామ ప్రజాప్రతినిధులు అంగన్వాడి కేంద్రాన్ని కూల్చివేశారు. అంగన్‌వాడీ కేంద్ర స్థలంలోని ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం చేపట్టేందుకు భూమిని చదును చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించిన పనులు ప్రారంభించలేకపోయారు. అచ్చంపేట, బంజపల్లి, నర్సింగరావుపల్లి గ్రామాలలో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ ఒకరే ఈ మూడింటి నిర్మాణం పనులు చేపడుతున్నారు. 19 నెలలుగా నిర్మాణం పనులు ముందుకు సాగటం లేదు. ఫలితంగా అరకొర వసతుల మధ్యన ఆరోగ్య ఉప కేంద్రాలు గ్రామంలో పురాతన భవనాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో వైద్య ఆరోగ్య సిబ్బంది అనేక పాట్లు పడుతున్నారు. సంబంధిత అధికార యం త్రాంగం ఆర్బాటంగా 19 నెల క్రితం ఆరోగ్య ఉప కేంద్రాలకు శంకుస్థాపనలు చేయించారు తప్ప నిధులు సమకూర్చాలని ఆలోచన లేకపోవడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అసంపూర్తిగా మిగిలిపోయిన ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి నిధులు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అచ్చంపేటలో ఉప కేంద్రం నిర్మాణానికి అంగన్‌వాడీ భవనం కూల్చివేసి చదును చేసిన స్థలం ఇదే



అసంపూర్తిగా మిగిలిపోయిన నరసింహారావుపల్లి ఆరోగ్య ఉపకేంద్రం ఇదే

మొక్కలు నాటిన మైనారిటీలు



వనమహోత్సవంలో మొక్కలను నాటుతున్న మైనారిటీలు

లింగంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలో శనివారం మైనారిటీలు వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. మైనారిటీ పాఠశాల, మజీద్, ప్రాంతాలతో పాటు పలు ప్రాంతాల్లో మొక్కలను నటారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అబ్దుల్ వాహాబ్ మాట్లాడుతూ.. మానవ మనుగడ వృక్షలపైనే ఆధారపడి ఉందని ప్రతీ ఒక్కరు కనీసం ప్రతీ ఏటా 5మొక్కలను నాటి సంరక్షించాలని ఆయన కోరారు. ఇంటి పరిసరాలతో పాటు వ్యవసాయ పంట చేనుల వద్ద మొక్కలను నాటాలని ఆయన సూచించారు. చెట్లు ఉంటే వర్షాలు కురుస్తాయని వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చునని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో మైనారిటీలు జుబేర్, నజీర్, అబ్దుల్ వాహాబ్, ఫసీ సిద్దీఖీ, సిరాజ్, ఖజామియా, అశ్వక్, ఫసీయొద్దీన్, రఫీక్, ఫైయాజ్‌లతో పాటు మైనారిటీలు ఉన్నారు.

బిచ్కుంద సీఐగా రవికుమార్



బాధ్యతలుస్వీకరిస్తున్న సీఐ

బిచ్కుంద, జూలై 12(ఆంధ్రజ్యోతి): బిచ్కుంద సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా రవికుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతి భద్రతల కోసం కృషిచేస్తానని తెలిపారు. నేర నియంత్రణకు ప్రత్యేక దృష్టిపెడుతానని తెలిపారు

మెగా ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

కామారెడ్డిటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలోని బతుకమ్మ కుంట ఉర్దుభవన్‌లో మెడిసిటి, లయన్స్ క్లబ్ ఆఫ్ రామాయంపేట స్నేహబంధు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిభిరం నిర్వహించారు.ఈ వైద్యశిభిరంలో బీపీ,షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు చెవి, ముక్కు, గొంతు, వరిబీజం, బీజకుట్లు, గడ్డలు,కణతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భసంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మసమస్యలు, మోకాళ్ల నొప్పులు, నడుమునొప్పులు, ఉపిరితిత్తుల సమస్యలపై శిభిరం నిర్వహించారు. దాదాపు 387 మంది పాల్గొనగా ఉచిత మందులను అందించారు..

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని నాలుగవ వార్డు టీచర్స్ కాలనీలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. సీసీ నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగం గోపి, కృష్ణ, దుంపల శంకర్, మాజీ ఎంపీటీసీ గోవింద్, ఎన్ ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు నాగం శ్రీనివాస్, నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

రామారెడ్డి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోషంపూర్‌లో ఇటీవల ప్రారంభించిన సీసీరోడ్డు పనులను మాజీ ఎంపీటీసీ దత్తాత్రి, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి గురుమూర్తి, మాజీ వీడీసీ అధ్యక్షులు కల్లెం రాజు రూ.20 లక్షలతో నిర్మాణం చేస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పరామర్శ



మోటూరి శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

రామారెడ్డి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల యాంజియోగ్రామ్ చేసుకుని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ కామారెడ్డి పట్టణ అధ్యక్షులు మోటూరి శ్రీకాంత్‌ను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పరామర్శించిన వారిలో బీజేపీ యువ మోర్చా జిల్లా కార్యదర్శి ఇసాయిపేట నరేష్, బానపూర్ శ్రీకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యేకు సన్మానం

రామారెడ్డి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అమెరికా పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన సందర్భంగా మర్యాద పూర్వకంగా శనివారం శాలువా కప్పి మెమోంటో అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రామారెడ్డి మండల మాజీ రైతు బంధు అధ్యక్షులు గురజాల నారాయణ రెడ్డి, రామారెడ్డి మాజీ ఎంపీటీసీ రజితరాజేందర్ గౌడ్, గొల్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పాల మల్లేశ్, మాజీ వార్డు సభ్యులు రాజయ్య, లింగం, మల్లయ్య, మాజీ విడిసి అధ్యక్షుడు మర్రి అంజయ్య, మాజీ రైతు బంధు అధ్యక్షుడు మర్రి భూమయ్య, బీఆర్ఎస్ నాయకులు మల్లయ్య, గ్రామ పెద్దలు, కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



సన్మానం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నేతలు, నాయకులు

మన సంస్కృతికి ప్రతీక బోనాలు

- ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు సిద్ధం



గ్రామాల్లో బోనాల సందడి

మద్నూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజలు తమ సంస్కృతిని ప్రతిబింబిస్తూ జరుపుకునే ప్రధాన పండుగల్లో బోనాలది విశిష్ట స్థానం, పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా సర్వత్ర ప్రతి ఏటా బోనాల పండుగ జరుపుకుంటారు. గ్రామ వన దేవతలను పూజించే ప్రశస్తం కలిగిన ఈ బోనాల ఉత్సవం. ఆషాడమాసం నుం చి ప్రారంభమై శ్రావణమాసం పూర్త య్యే వరకు కొనసాగుతుంది. వర్షాలు బాగా కురవాలని, పాడిపంటలు వృద్ధి చెందాలని, గ్రామాలు, కుటుంబాలు చల్లగా ఉండాలని కోరుకుంటూ జనం గ్రామదేవతలకు మొక్కుబడులను చెల్లిస్తారు. ఆషాడ మాసం నుంచి శ్రావణమాసం చివరి వరకు గ్రామ దేవతలంతా ప్రజల మధ్యనే సంచరిస్తారనే విశ్వాసంతో పాటు, వర్షాకాలం ఆరంభదశలో జ్వరాలు, విరేచనాలు, మలేరియా వంటి అంటూ వ్యాధులు ప్రబలే కాలం కావడంతో ప్రజానీకం చీడపీడల నుంచి తమను కాపాడమం టూ గ్రామ దేవతలైనా పోచమ్మ, మైసమ్మ, మహంకాళి, కాళికాదేవి ఎల్లమ్మ, ముత్యాలమ్మ, నల్ల పోచమ్మ అనే ఏడుగురు అక్క చెల్లెలు తమ్ముడైన పోతురాజులను పూజించడం సాంప్రదాయంగా వస్తుంది. మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించడానికి తీసుకెళ్లే సమయంలో బోనాలు కన్నుల పండుగగా కనిపిస్తాయి. బోనం కుండకు పసుపు రాసి కుంకుమ పూసి బొట్టు పెట్టి వేపాకులను మాలలుగా చుట్టి తయారు చేస్తారు. బోనాల పండుగలో మేక పోతుల బలి ప్రధాన ఘట్టం. తెలంగాణలో విరివిగా లభించే కల్లును సాకగా పరిగణిస్తారు. అమ్మవార్లకు సాక ప్రీతిపాత్రం కావడంతో సాక బోయడం దేవతలకు బలిచ్చేందుకు తమ వెంట తోడుకొని వచ్చిన మేకపోతులను సై తం వేప దండలు వేసి పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. వాటికి సాకను తాగిం చి జలత తీసుకున్న తర్వాత బలిస్తారు .మేకపోతుల రక్తంతో తడిచిన బోనాన్ని ఊరి పోలిమేరల్లో చల్లడం వల్ల గ్రామంలోని అంటూ వ్యాధులు వ్యాపించవని నమ్మకం ప్రధానంగా ఆదివారం, మంగళవారం జరుపుకునే పండుగ అద్యంతముగా అలరిస్తుంది.

భిక్కనూరు : భిక్కనూరు మండలకేంద్రంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అషాఢ మాసం పురస్కరించుకుని శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకాంబరీ దేవిగా వివిధ రకాల కూరగాయలతో అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

'బోన'భాగ్యాలు

(5వ పేజీ తరువాయి)

దండ మేడలో వేసి అలంకరించి నైవేద్యంగా బలిస్తారు.

అంటువ్యాధులు రాకూడదని..

బోనాలు దించిన చోటా కల్లుతో చుట్టూ గీతలో పోస్తారు. దీనినే కల్లుసాక అంటారు. ఇది రక్తానికి సంకేతం అని సామాజిక శాస్త్ర వేతల అభిప్రాయం. బలిచ్చే జంతువును పోచమ్మ ముందుకు తీసుకువచ్చి దాని నోట్లో మెడపై నుంచి కల్లు పోస్తారు. కల్లు పడగానే గుగ్గిలం పోగ వేస్తారు. ఆ పై ఆ జంతువ జడత ఇస్తే అమ్మవారు ఒప్పుకొందని అంగీకరించిందని భావించి బలిస్తారు. దాని రక్తాన్ని నేలపై తడిపి బోనం రాశి పై చల్లుతారు. ఈ రక్తంతో తడిసిన బోనాన్ని ఊరు పొలిమేరకు నలు దిక్కులా చల్లుతారు. దీంతో అంటువ్యాధులు తమ ఊరిలోకి రావని నమ్మకం.

ఒక్కో దేవతకు ఒక్కోలా..

ఏడుగురు గ్రామ దేవతల్లో ప్రత్యేకమైన పద్ధతులు ఉంటాయి. పశువులను కాపాడే దేవతగా మైసమ్మను కొలుస్తారు. ఇళ్లలో శుభ కార్యాలకు ఎలాంటి ఆటంకాలు రావద్దని ముత్యాలమ్మ, చిన్న పిల్లలను కాపాడే దేవతగా పోచమ్మను కొలుస్తారు. చెరువు కట్టలను కాపాడే దేవతగా కట్ట మైసమ్మను ఆరాదిస్తుంటారు. ఈ దేవతలందరికీ చేతులు ఉండవు, ఆకారం ఉండదు. నిరాకార చింతనకు ప్రతి రూపంగా గ్రామ దేవతలు ఉంటాయి. ఈ దేవతల ఆరాధన ప్రజల విశ్వాసాలపై ఆధారపడి ఉంటుంది. పండుగ ఒక్క రోజుకే పరిమితం కాదు. ఆషాఢ మాసం నుంచి శ్రావణ మాసం వరకు ఎక్కువగా ప్రతీ ఆదివారాల్లో ఈ పండుగను చేసుకుంటుండగా పలుచోట్ల మంగళ, గురు వారా ల్లో పండుగను జరుపుకుంటారు. ఒక్కో గ్రామంలో ఒక్కోరోజు బోనాలు జరుపుకోవడం విశేషం.

పిల్లా పాపల కోసం బోనాలు తీస్తాం

● మద్దూరి కల్పన, దోమకొండ



ప్రతీ ఏడాది ఆషాఢమాసంలో వర్షకాలం కావడంతో పిల్లా పాపలకు, గొడ్డూ గోధకు వ్యాధులు సోకకుండా ఉండేందుకు పోచమ్మలకు బోనాలు తీస్తాం. వ్యాధుల నుంచి ప్రతీ ఒక్కరిని రక్షించాలని, నైవేద్యాలు సమర్పిస్తూ బోనాలు తీస్తాం. అందుకే అన్ని గ్రామ దేవతలకు బోనాలు సమర్పిస్తాం. దోమకొండలోని చాముండేశ్వరి దేవి బోనాల పండుగకి ఒక ప్రత్యేకత ఉంది. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ అమ్మవారి తర్వాత దోమకొండకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రతీ సంవత్సరం మహంకాళీ అమ్మవారికి బోనాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటాం.

గ్రామదేవతలకు నైవేద్యం సమర్పిస్తాం

● పన్యాల భారతి, దోమకొండ



బోనాలు తీయడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. గ్రామాల్లో పోచమ్మలకు, గ్రామ దేవతలకు బోనాలు తీయడం తాత ముత్తాతల నుంచి వస్తున్న సంప్రదాయం. అలాగే ఇప్పటికీ బోనాలు తీయడం గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం. అలాగే వ్యాధి సోకకుండా గ్రామ దేవతలను వేడుకుంటాం.

సబ్బండ వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

● మాజీ జడ్పీటీసీ నారెడ్డి

రామారెడ్డి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సబ్బండవర్గాల అభివృద్ధి కాంగ్రెస్ ధ్యేయమని మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వహయాంలో మహిళలను కించపరుస్తూ మంత్రివర్గంలో ఒక పదవి కూడా ఇవ్వని నియంత ప్రభుత్వం కేసీఆర్ దని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే స్వేచ్ఛకు మారు పేరని అన్నారు. దొరల పాలనలో సబ్బండ వర్గాలు అణిగిపోయాయని పేర్కొన్నా రు. బీసీలకు 42 శా తం రిజర్వేషన్ ప్రక్రియ ను కామారెడ్డిలోని గౌరవ షబ్బీర్ అలీ ఇంట్లో ప్రక్రియను పూర్తిచేసి ఎన్నికల హామీలో బాగంగా అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని పేర్కొన్నారు.

లింగంపేట : బీసీల అభ్యున్నతి కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీక్ అన్నారు. ఆయన శనివారం లింగపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వౌస్ చైర్మన్ జొన్నల రాజు, నాయకులు ఎల్లమయ్య, గొల్ల సాయిరాం, అశోక్, ఏడల్, అట్టెం శ్రీను, పూల్ సింగ్, లక్ష్మీనారాయణ మండలనాయకులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలంతా కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని కోరారు.

సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

మాచారెడ్డి, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫరీద్‌పేట్‌లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ రైతులు శనివారం సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల సభ్యులు మాట్లాడుతూ విద్యుత్ సమస్య ఇటీవల ఎక్కువైందని, ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన కార్యక్రమం చేపట్టారన్నారు. ఈ మేరకు ఎస్ఈ, డీఈ, ఏఈ స్పందించి సమస్యను పరిష్కరించి ఇలాంటి సంఘటన మరలా జరగకుండా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌లో వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థినుల భవిష్యత్తు

● రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం

నసురుల్లాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినిల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినీల కోసం మంచి విద్య, భోజనం అందించాలన్న సంకల్పంతో ముందుకెళ్తుందన్నారు. శనివారం నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తప్పనిసరిగా నాణ్యమైన భోజనం, విద్య అందించాలన్నారు..అనంతరం ఆయన స్థానిక ప్రిన్సిపాల్‌తో విద్యార్థినిల సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలాదేవి, ఉపాధ్యాయినిలు, విద్యార్థులు ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నియోజకవర్గ ప్రజలు ఆత్మీయత పంచారు

● మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్

సదాశివనగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఈ సారి తనకు అధికారం ఇవ్వకపోయినప్పటికీ చేసిన అభివృద్ధి మంచి పనులతో ఆత్మీయ మరింత పెంచుకున్నారని ఎల్లారెడ్డి మాజీఎమ్మెల్యే జాజుల సురేందర్ అన్నారు. శనివారం మండలంలోని పలుగ్రామాల్లో కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. గంగాధర్‌రావు అనారోగ్యానికి గురికాగా ఆయనను పరామర్శించారు. మోడీగాం, మర్కల్ గ్రామాలలో ప్రమాదాలకు గురైన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఆరోగ్యం పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ప్రజలు తనపై చూపిన ఆధరా భిమానాలు చిరకాలం గుర్తుండిపోతాయన్నారు. కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్దానాలకు కొం దరు ఆకర్షితులు కావడం వల్ల బీఆర్ఎస్‌కు అధికారం దక్కలేదన్నారు. కార్యకర్తలు ప్రజలు మనోధైర్యంగా ఉండాలని రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు మంచి రోజులు వస్తాయని, ఎల్లారెడ్డి ప్రజలు తనపై చూపిస్తున్న ఆప్యాయత, ఆధారాభిమానాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఎల్లారెడ్డి నియోజక వర్గం ప్రజలకు నిరంతర సేవలు అం దించడానికి శాయశక్తుల కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడుమహేందర్, శ్రీనివాస్ నాయక్, మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాద వితరణ



అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాద వితరణగావిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్ , జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో శనివారం భక్తులకు అన్నప్రసాదవితరణ గావించారు. అంతకుముందు ఆలయ అర్చకులు అయ్యప్పస్వామి మూల విరాట్టుకు అభిషేకం, అర్చనలు చేపట్టారు. నూతన వస్త్రాలతో స్వామి వారిని అలంకరించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు భక్తుల కోసం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులున్నారు.

బాన్సువాడ డిపో నుంచి తీర్థయాత్ర బస్సు

బాన్సువాడటౌన్ , జూలై 12 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ డిపో నుంచి ఈ నెల 20న పర్లి వైద్యనాథ్, అంబాజోగాయ్, పండరిపూర్, షోలాపూర్, తుల్జాపూర్ తీర్థయాత్రకు బస్సు వెళ్లనున్నట్లు డిపోమేనేజర్ సరితాదేవి తెలిపారు. ఈ బస్సు 20న ఉదయం బాన్సువాడ నుంచి బయలుదేరి 21న రాత్రి వరకు తిరిగి బాన్సువాడకు చేరుకుంటుందని ఆమె తెలిపారు. పెద్దలకు 2,200 , పిల్లలకు 1,100 రూపాయల టికెట్టు ఉంటుందని, ప్రయాణీకులు మరిన్ని వివరాలకు గోపీకృష్ణ 9063408477 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

హనుమాన్ మందిరాల్లో భక్తుల పూజలు

బాన్సువాడటౌన్ , జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెద్దహనుమాన్ మందిరం, శ్రీరామ మందిరం, వ్యాయామశాల హనుమాన్ మందిరం, పాతబాన్సువాడ హనుమాన్ మందిరాల్లో శనివారం భక్తులు ఆంజనేయ స్వామికి ప్రత్యేకపూజలు చేశారు. అర్చకులు ఉదయం నుంచి స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు జరిపించారు. సింధూరంతో ఆంజనేయస్వామి విగ్రహాన్ని అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక పెద్దహనుమాన్ మందిరంలో మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు

నసురుల్లాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హాజీపూర్, సంగం, నసురుల్లాబాద్ గ్రామాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందు పటేల్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గంలో మజీఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి సహకారంతో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వారికి సుమారుగా నాలుగు లక్షల రూపాయల చెక్కులను అందజేశారన్నారు. కార్యక్రమంలో నసురుల్లాబాద్ మండల అధ్యక్షులు నందు పటేల్, హాజీపూర్ గ్రామ మాజీసర్పంచ్ అర్గె అంజయ్య, కిషన్, భాస్కర్, రుప్సింగ్, సిరీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐబీఎస్ఎస్ మండల శాఖ ఎన్నిక

బీర్కూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం బంజారాలు సమావేశమయ్యారు. సమావేశంలో ఆల్ ఇండియా బంజార సేవా సంఘం మండల శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐబీఎస్ ఎస్ మండల అధ్యక్షుడు విస్లావత్ దాము నాయక్, ఉపాధ్యక్షులు శ్రీచంద్ నాయక్, భీక్యానాయక్, ప్రధాన కార్యదర్శి గోవింద్ నాయక్, కోశాధికారి రవి, జాయింట్ సెక్రటరీ బాపు సింగ్, గౌరవ అధ్యక్షుడు పాండులు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు సన్మానం



అజ్మతుల్లాఖాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రామారెడ్డి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వర్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా ఖాన్‌కు శనివారం ఏఎంసీ డైరెక్టర్ ఎం.డి. రావుఫ్, రామారెడ్డి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగోల్ల ప్రవీణ్ గౌడ్‌లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు తూర్పు రాజు, వడ్ల లక్ష్మీరాజాం, అంబాయి ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి ఎస్సైకి సన్మానం

రామారెడ్డి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌కి నూతనంగా సబ్ ఇన్‌స్పెక్టర్‌గా లావణ్య బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శనివారం పోలీస్‌కానిస్టేబుల్ సుప్రియకి మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామ పంచాయితీ మాజీ పాలక వర్గం మాజీ సర్పంచ్ పాల మల్లేశ్, నాయకులు మాజీ వార్డు సభ్యులు కె.రాజయ్య, వి.లింగం, జె.మస్కట్ మల్లయ్య, మాజీ రైతు బంధు అధ్యక్షుడు మర్రి భూమయ్య, మాజీ విడిసి అధ్యక్షుడు మర్రి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు జె.మల్లయ్య గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - కన్నప్ప
ప్రియా 70 - 8 వసంతాలు
ప్రియా 35 - కుబేరులు

బాన్సువాడ

మహేశ్వరి - ఓ భామ అయ్యో రామ
వెంకటేశ్వర - సూపర్‌మ్యాన్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

